# న్యాయం నిదురపోయింది



రచన :

శ్రీ వేముగంటి శ్రీనివాసరావు.

(గత సంచిక తరువాయి)

క్లిక్ బెల్-తోలగించుకొని "లక్ష్మీ-లక్ష్మీ" అని పిలుస్తూ లోపలికెళ్ళాడు రాము!

వంట చేస్తుంది కాబోలు ఏవండీ?...ఎవరు కావాలి మీకూ అంటూ అడిగింది ఆ ఇల్లాలు. రాముకు పిచ్చి లేసినట్లనిపించింది నా లక్ష్మెక్కడి కెళ్ళింది? ఈ ఇంట్లో లేదా ఎటెల్లినట్లు పిచ్చివానిగా చూస్తున్న రామును చూస్తు ఏయ్... మిస్టర్, ఎవరుకావాలీ అంటూ కోపంగా ప్రశ్నించింది.

"లక్ష్మీ...నా లక్ష్మండీ" అనుకోకుండానే రాము నోట్లోనుండి ఆ మాటలు వెలువడ్డాయి.

"లక్ష్మీ...లక్ష్మీ అనే పేరుగలవారు ఇక్కడెవరూ లేరండీ? మేము నాలుగు నెలల నుండే ఈ ఇంట్లో అద్దె కుంటున్నాము. అటువంటి వారెవ్వరూ మాకు తారస పడలేదు. పక్కింటి వారికేమైనా తెలుసేమో...అడ గండి" అంటూ గడగడా వాగి ఇక పోతారా అతల కూర మాడి పోతుంది అన్నట్లు చూసింది, ఇక్కడికైనా తన పీడ విరగడైతే బాగుండునన్నట్లు.

బరువుగా భారంగా వెనక్కి అడుగేశాడు రాము.

ఈ విశాల ప్రపంచంలో లక్ష్మికోసం ఎక్కడని వెతకను. ఏ మూలని అన్వేషించను. ఇక ఒక్కటే ఆధారం. ప్రక్కింటి సుబ్బలక్ష్మమ్మగార్నడగాలి. లక్ష్మికి సుబ్బమ్మగారంటె ఎనలేనిగౌరవం. ఎప్పుడూ ఆమెతో కాలక్షేపం చేసుక్కూర్చునేది. ఆమె నడగాలి నా లక్ష్మెక్కడికెళ్ళిందో అనుకుంటూ అటు ప్రక్కగా అడుగులేశాడు రాము.

"ఏమండీ నా లక్ష్మేది?" అంటూ అడిగాడు ఆరా టంతో ఆతృతగా.

"కూర్చోబాబూ...కూర్చో చెబుతాను" కుర్చీమీద కూర్చున్నాడు రాము. సుబ్బలక్ష్మమ్మ లోనికెళ్ళి ఒక కవరుతెస్తు ఈ వుత్తరం చదువు బాబూ. అంతా తెలు స్తుందీ అంటూ కవరిచ్చి గిర్రున తిరిగి వెళ్ళిపోయింది సుబ్బలక్ష్మమ్మ. వణికే చేతుల్తో లక్ష అనుమానాల్తో ఉత్తరం విప్పాడు రాము అది లక్ష్మిరాతే గబగబా చద వడం మొదలెట్టాడు రాము,

ప్రియమైన శ్రీవారికి నమస్కారాలతో-

ఇంతవరకూ మీకు నే నెలాంటి వుత్తరమూ వ్రాయ లేదు. రాసె అవసరమూరాలేదు. భార్యబర్తల వుత్తరాలు మధురమైన సంకేతాలో మరపురాని ఊహాల్తో అను, రాగాన్ని ఆత్మీయతను రంగరించి ప్రేమతో రాసుకుం టారు. అలా రాయాలిని నాకూ వుండేది. కాని మన కట్టి సందర్భము కలసిరాలేదు. ప్రియమైనవారు వ్రాసిన వుత్తరం చదువుతూవుంటె మధురమైన ఊహాల్తో చిరు మందహాసాల్తో పున్నమ చంద్రునిలా మొము వెలిగి పోతుందట కాని...నేను మిమ్మల్ని బాధపెడుతున్నం దుకు, అందమైన మీ మోమును వివర్ణంచేస్తున్నందుకు, నన్ను క్షమిస్తారు కదూ?

రంగాపురంలో నన్ను కామించి కాదన్నందుకు మంచికి మారు పేరైన దేవుడిలాంటి మామయ్యను పొట్టన పెట్టుకోవడమే కాక, భూమిని ఆక్రమించి మనను నిలువ నీడలేకుండాచేసిన భూపతిరావుగారి ఆఫీసులోనే మీరు పనికి కుదరడం నిజంగా మనదురదృష్టం. పాత పగను మరువలేక పంతం విడువలేక కక్షించి పనిచేస్తు కాలం గడుపుతున్న మనపై తన విషపుకోరల్లోని విషాన్నంతా కుమ్మరించి మిమ్మల్ని జైలుకు పంపాడు. అపుడు దేవుడు నిదురపోయాడు. న్యాయంబడి ఏడుస్తుంటె, అన్యాయం పురి విప్పి నాట్యమాడుతుంటె చాతకాని వాడిలా చూస్తు కూర్చున్నాడు దేవుడు.

డ...బ్బులనేది వుంది చూశారూ, నిజంగా దానంత

MAHENDRA

ISI

పంపులు - మోటారులు

మీరు...

ఎక్కువ పంటలు పండించుటకు



మహేంద్ర



పంపులు మరియు మోటారులకు

అమర్చండి.

"మహేంద్ర" ఎలెక్ట్రిక్ మోటారులు మరియు సెంట్రిఫ్యూగల్ పంపులు సింగిల్ ఫేస్, 3 ఫేస్ మోనోబ్లాక్స్ కపుల్డ్ సెట్ మరియు బెల్ట్ పంపులు అన్ని సైజులలోనూ దొరుకును.

ఆంధ్ర ప్రభుత్వము వారిచే తక్కావి కంతులలో అంగీకరించబడినది.

—— వివరములకు ——

ఫోన్: 30138 గ్రాం: "మహీపంప్"

**MAHENDRA ENGINEERING WORKS**
**Coimbatore-641 037.**

చెడ్డదిలేదు. దాని కోసం మనిషేకాదు దేవుడుకూడా చెప్పినట్లల్లావింటాడు. అన్యాయాన్ని చూస్తున్న దేవుడు పంతంకోసం ఒక అబలను ఎత్తుకొని పోయి శీలాన్ని చెరచి కాకులుచింపిన విస్తరిలా చేసి ఇంట్లో పడేసి నప్పుడు కూడా నోరు తెరువలేదండీ! ఈ లోకాన్ని! ఈ సంఘాన్ని మట్టిలో కలుపాలనిపిస్తుంది. శీలం చెడిన నేను మీకు ఎలాముఖం చూపమంటారు? కల్మష మెరుగని మీకు కరుణా జాలియే కల పాలవంటి మనసుగల పవిత్రమైన మీకు, శీలం చెడిపోయి పవిత్రత అనే మాటకు అర్థంలేని నేను, పతితను మీకు తగను. వాడిన పుష్పం వికసించడం జరుగదు. నలిగిన హృదయం పూర్వపు సౌఖ్యం నోచుకోదు నాజీవితమంతే. అందుకే మిమ్మల్ని మరువలేకన్నా, మిమ్మల్ని విడిచి పైలోకాలకు వెడుతున్నాను. మీరెప్పటికైనా తిరిగివస్తారనీ నాకోసం చూస్తారనీ తెలుసు, అందుకే ఈ వుత్తరం వ్రాసి సుబ్బలక్ష్మమ్మగారికి ఇస్తున్నాను. వచ్చేజన్మలోనైనా మీ భార్యనై అనురాగపు అంచుల్ని ఆనందపుపరిధిని దాటి మీ కౌగిలిలో నా జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నాను. సెలవామరి-

మీ ప్రేమను అనుభవించలేని
అభాగ్యురాలు, లక్ష్మి.

ఉత్తరాన్ని చదివిన రాము కళ్ళనుండి సముద్ర కెరటాలకు మళ్ళే కన్నీరు ఉబుకుతూ వచ్చింది. ముఖంలో జీవకళేలేదు. తన్నుప్రేమించి తనను దేవునిగా పూజించి కష్టాల్లో భాగం పంచుకున్న లక్ష్మి ఇక లేదంటే అతని బాధను అర్థం చేసుకునే వారులేరు. ఆదరించేవారు అంతకూలేరు. కళ్ళనుండి అవిరామంగా కారుతున్న కన్నీళ్ళతో ఉత్తరమంతా తడిసిపోయింది. ఉత్తరంలాగానే మనసుశూన్యం చేసి పోయిందనుకున్నాడు రాము.

లోపలి నుండి సుబ్బలక్ష్మమ్మగారు. "బాబూ-రామూ కాఫీ త్రాగు" అంటూ తెచ్చి పెట్టి ఏమో బాబూ ఎంతో మందిని చూశాను గానీ ఇలాంటి పిల్లను నే చూడలేదు. అబ్బ ఎంత అభిమానం. నీవు జైలుకెళ్ళిన రాత్రి బాగానే వుంది తెల్లవారే సరికల్లా ఉరిపోసుకొని శవాకారంలా పడి వుంది నిజంగా...అంత అభిమానం కూడా అనర్థమే బాబూ...నీవు జైలుకెళ్ళి మాత్రం తను చనిపోవాలా! నిజంగా భూపతిరావుగారు చాలా సహాయ

పడ్డాడు. పోలీసులూ కేసులూ అలాంటివేం లేకుండా ఏదో...తప్పు చేశాడు...అయినా...అతను నా మనిషి కాదా! అంటూ దగ్గరుండి మున్సిపాలిటీ వారితో శవ దహనం చేయించాడు, అంటూ ఇంకే నేవో చెప్పుతూ పోతుంది రాము మనసుకు ఆవేమి ఎక్కడం లేదు. తండ్రిని చంపుతున్న భూపతి, పంటకోసుకుపోతున్న భూపతి, తన్ను జైలుకు పంపుతున్న భూపతి, లక్ష్మిని బలత్కరించే భూపతీ కళ్ళ ముందు కదులాడ్తుంటె. "ప్రతీకారం తీర్చు, మా ఆత్మకు శాంతి కలిగించు పగ సాధించు" అంటూ తండ్రీ, లక్ష్మిలకంఠాలు చెవిలో అరుస్తున్నట్లుగా వినిపిస్తున్నాయ్. ఆవేశంతోలేచి అడుగులు గబగబావేస్తు వెళ్ళాడు రాము.

♦ ♦ ♦

అది పున్నమ వెన్నలరాత్రి. ఆకాశం చుక్కలతో వింత అందాన్ని చేకూర్చుతుంది. రేరాజూ తారకలూ ఆటలో మునిగి పోయారు. శశాంకుని అందుకోవాలనే ఊబలాటంతో వడిగా చంద్రునితో సమంగా పరుగెడుతున్నాయి తారకలు, అయినా ఆయనను అందుకోలేక పోతున్నాయి. అంతలోనే ఒక తార ఆయన సమీపాని కొచ్చింది కాని పాపం అంతలోనే ఎక్కడలేని సిగ్గు ముంచుకొచ్చింది కాబోలు మినుకు మినుకూ మంటూ నుంచుంది. అందుకోలేని దాన్ని అందుకుంటున్నప్పుడు సిగ్గుకు తావిచ్చి సమయాన్ని దుర్వినియోగ పరచవద్దని పాపం ఆ చిన్ని తారకు తెలువదిలా ఆ చిన్ని తారకను చూడనట్టే, చూచినా అందకుందేందుకే నెలరాజు తన వెన్నెలను ప్రపంచానికి పంచుతూ, ఇంకా వేగంగా పరుగెడుతున్నాడు. పుట్టపైదుట్టపై, పెల్లెపై, ప్రజలపై సమరగా వెన్నెల పంచె వెన్నెల రాజు తారకలపై అంత కినుక వహించుటకు కారణ మేమిటో?

♦ ♦ ♦

ఆ వూరి చెరువుకట్టపైనుండి ఒక వ్యక్తి గబగబా అడుగులు వేసుకుంటూ ఊరివైపుగా వస్తున్నాడు. బలంగా పడే అతని అడుగులు అతని కృత నిశ్చయాన్ని తెలుపుతున్నాయి. మాటమాటికి అతని చేతులు బిగుసుకుంటున్నాయి. పండ్లను పటపట లాడిస్తున్నాడు. నల్లని బరివి గడ్డము. కోపంతో ప్రతీకార వాంఛతో ఎర్రబడ్డ అతని కళ్ళు చూస్తుంటె పెద్దవారికి కూడా భయమేస్తుంది. తెల్లటి చెరువు నీటిలో ప్రతిఫలించే నీలాకాశంలోని రే రాజు తారకలూ చిరుగాలికి తల లూగిస్తున్న పచ్చని పైరుపొలాలూ అతని మనసును ఆకర్షించలేక పోయాయి.


చిరకాల మన్నిక–అతి ప్రకాశవంతమైనది–నవీన పనితనము!

# నోవెల్ వజ్రములు




నగలను అలంకరించుటకు,
విశిష్టతకు ప్రసిద్ధి చెందినది.
అన్ని విధములైన కలర్ కమలములూ
మావద్ద దొరుకును.
మా వజ్రములకు గ్యారంటి ఇవ్వబడును.

: తయారించువారు :

Phone No.: 27468

# Novel Diamond Works

WEST RANI STREET, :: TIRUCHIRAPALLI-620 008

గబగబా అడుగులు వేస్తూ ఊళ్ళోకొచ్చి భూపతిరావు ఇంటి ముందు నిలుచున్నాడు. అప్పటికీ ఇప్పటికీ ఊళ్ళో ఎంతో మార్పొచ్చినట్లు కనిపించింది. వీధి దీపాలు వెలుగుతున్నాయి. వీధులు కూడా విశాలంగా తయారయ్యాయి. అప్పుడు రాత్రి 9 పదిగంటలే అయినా ఎక్కడ ఒక్క మనిషి కూడా తెలివిలో లేడు. ప్రొద్దునంతా కష్టించిపని చేసి ఒళ్ళు మరచి నిదురపోతున్నారు. అక్కడొక కుక్క అరుపు, కీచురాళ్ళ ధ్వనులు తప్ప ఎలాంటి శబ్దమూ లేదు. రెండవ అంతస్తులో డన్‌లప్ పరుపుపై నిశ్చింతగా గుర్రుపెట్టి నిద్రపోతున్న భూపతిరావుకు తన గదిలోని కిటికీలోంచి ఒక మనిషి రావడం క్రూరంగా ప్రతీకార వాంఛతో తనవైపు అడుగులు వేస్తుండడం ఏమీ తెలియదు. ఆగాంతకుడు నిండుగా కప్పుకున్న భూపతిరావుపై దుప్పటి లాగివేశాడు. తెలివైన భూపతి మసక మసకగా కనిపిస్తున్న ఆకారాన్ని చూసి తడబడుతూ "ఎ...ఎ...ఎవ్వరూ" అంటూ బెడ్‌లైట్ వెలిగించాడు.

"ఎవ్వరా?...ఏం...నన్ను గుర్తులేక పోతున్నావా? నేను...నేనురా! నీవు చేసిన దౌర్జన్యానికి బలి అయిపోయిన వెంకయ్య కుమార్ని, నీ కామ దాహానికి ఆహుతి అయి ఆత్మహత్య చేసుకున్న లక్ష్మి మొగన్ని, అధికార బలంతో చేయని నేరానికి ఆరునెలలు కారాగార శిక్ష అనుభవించిన రా...మూ...ని" ఏం తెలిసిందా! నే నెవ్వరోన్న. ప్రతీ ప్రాణి లోను అంతర్గతంగా కొన్ని శక్తులు దాగేవుంటాయని. అవసరమైనపుడూ మరే అసరాలేనప్పుడూ తన సర్వశక్తుల్ని కేంద్రీకరించడం జరుగుతుంది. తెలుసా? అంటూ ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూ వస్తున్నాడు. ఆ ఒక్కొక్క అడుగు తనను మృత్యువు దగ్గరికి పంపే ఒక్కొక్క మెట్టులా అనిపిస్తుంది భూపతిరావుకు, జాలి అనేది లేక ఎన్నో ప్రాణాలు తీసిన భూపతిరావుకు, తన ప్రాణం మీదకు వచ్చే వరకు రాము కాళ్ళుకూడ పట్టుకునేందుకు తయారయ్యాడు. "ఏం...భూపతి నీకు ప్రాణమంటె అంత తీపా? అందరికీ అలా కాదనుకున్నావా? నీవు ఒక్కనివి బ్రతికుంటె కొన్నివందల కుటుంబాలకు ముప్పు, అందుకే నిన్ను బ్రతుక నివ్వను" అంటూ చేతితో బలంగా గుండెల్లో కొట్టాడు రాము.

భూపతిరావు పెట్టిన కేకలకు ఇంటిలోని నౌకర్లందరూ పైకివచ్చి ఆవేశం తగ్గక గుండెనిండా, కొడుతున్న రాముని చూసి అంతలోనే చేయవలసిన పనిజ్ఞాపకం రాగా రాముని బంధించారు.

"ఇదండీ నాకథ" చెప్పుతున్న రాము ఒక్కసారిగా గుండెల నిండా ఊపిరి పీల్చుకొని.

"యువరానర్ స్వార్థపరులైన భూస్వాములు డబ్బుగల పెద్దమనుషులు చేసే అన్యాయాల్ని కప్పిపుచ్చుకునేందుకై డబ్బు ఎరగా చూపిపై ఉద్యోగ ధర్మాన్ని కూడా లెక్కచేయక డబ్బుకు ఆశపడి లంచం పుచ్చుకొని అన్యాయాన్ని మద్దతుచేసే ప్రభుత్వాధికారులున్నంత వరకూ ప్రతి పల్లెలోనూ ఇలాంటి ఘాతకాలు జరుగుతునే వుంటాయి. ఇలా జరగవలసిందేనా? మానవత్వ మున్న మనుష్యులెవరైనా దీన్ని సహిస్తారా? అందుకే విప్లవంరావాలి ఎక్కడో పడిన వర్షపు బిందువు భూమిలో ఇంకి పోతుందే కాని సాగి చరిత్ర కందదు. సాగే నీటిలో కలిస్తేనే తనూ సాగి సార్థకమవుతుంది. అందుకే ఒక్కరుకాదు అందరూ ఏకమై ధన కామంధుల పీక నొక్కయ్యాలి. అవినీతి కరశక్తులను మెట్టు బెట్టేందుకు ప్రభుత్వానికి చేయూత నివ్వండి."

మైకంనుండి తేరుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ "ఆర్డర్_ఆర్డర్...ముద్దాయి ఇది సభావేదికను కున్నాడు కాబోలు, ఇది కోర్టు, తాను నిలుచుంది ముద్దాయిలు నిలుచుండే బోను అనునది మరిచి పోయాడు కాబోలు" అంటు కూర్చున్నాడు.

అప్పటికే ఐదు గంటలు కావస్తున్నందున తీర్పు చెప్పేందుకై కేసును మరునాటికి వాయిదా వేశాడు జస్టిస్. బయటికి వెళ్తున్న ప్రేక్షకులందరూ! "న్యాయం నిదురబోయింది." అని, పాపం అంటు రాముపై జాలి కనబరుస్తు కదిలారు. (సంపూర్ణం)

ఎల్లప్పుడూ.....
టి. ఎన్. హెచ్. వారి
* సైనిక్స్ * ఆర్. ఓ.
కలర్ బనియన్లనే
ఉపయోగించండి.
ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.